క్లుప్తంగా

సామూహిక త్రినాథస్వామి వ్రతాలు



సామూహిక వ్రతాల్లో భక్తులు

ఇచ్ఛాపురం: పురపాలకసంఘం పరిధి బెల్లుపడ గ్రామంలోని శివానందగిరిపై సంక్రాంతి వేడుకలు మంగళవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సామూహిక త్రినాథస్వామి వ్రతాలను భక్తిశ్రద్ధలతో చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

స్వేచ్ఛావతి అమ్మవారికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణంలో అమ్మవారు

ఇచ్ఛాపురం: గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారికి సంక్రాతి నేపథ్యంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మూడు రోజుల పాటు వేకువజామున అమ్మవారికి తైలమర్దన, సిందూరమర్దన, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం భక్తుల దర్శనార్థం అమ్మవారిని ప్రత్యేకంగా ఆలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

తొలితరం కమ్యూనిస్టు యోధుడు పద్మనాభం



మాట్లాడుతున్న ఖగేశ్వరరావు

పలాస: కళింగాంధ్రలో తొలితరం కమ్యూనిస్టు యోధుడు సర్దార్ మార్పు పద్మనాభమని మార్పు ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ మట్ట ఖగేశ్వరరావు చెప్పారు. మందస మండలం హరిపురంలోని మార్పు గ్రంథాలయంలో పద్మనాభం 59వ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పద్మనాభం చిత్రపటానికి నివాళులర్పించారు. ట్రస్టు ప్రతినిధి సన్నశెట్టి రాజశేఖర్, కార్యవర్గ సభ్యులు కంసు కృష్ణమూర్తి, నల్ల హడ్డి, యు.సోమనాథం, వి.వి.రమణమూర్తి, పుచ్చ దుర్యోధన, సాలిన వీరాస్వామి, బద్రి కూర్మారావు, పులారి దుర్యోధన పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ మృతికి సంతాపం



రామారావు(ఫైల్)

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరు మాజీ ఎంపీపీ, బెండి గ్రామానికి చెందిన హనుమంతు రామారావు దొర (75) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఈయన దివంగత ఎంపీ అప్పయ్యదొర సోదరుడు. రామారావు మృతదేహానికి బుధవారం స్వగ్రామంలోనే అంత్యక్రియలు నిర్వహించారు. ఈయన భార్య విజయలక్ష్మి గతంలో పంచాయతీ సర్పంచ్‌గా సేవలు అందించారు. కాగా రామారావు మృతికి మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, నాయకులు పేరాడ తిలక్, కుర్మాన బాలక్రిష్ణ, బడిసి బాలకృష్ణ సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

రద్దీగా మాంసం దుకాణాలు



కాంప్లెక్స్ సమీపంలోని మాంసం దుకాణం వద్ద జనం

ఇచ్ఛాపురం: కనుమ పండుగ నేపథ్యంలో మాంసం దుకాణాలు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయాయి. బుధవారం వేకువజామునుంచే మాంసం, చికెన్ దుకాణాల వద్ద జనం బారులుదీరారు. ఇచ్ఛాపురం పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణం, దాసన్నపేట కూడలి, బెల్లుపడకాలనీ కూడలిలో చికెన్, మటన్ దుకాణాలు రద్దీగా కనిపించాయి.

ఘనంగా జీవాలకు చెవులు కోసే పండుగ



కంట్రగడ మంద వద్ద జీవాలకు చెవులు కోసే పండుగలో కాపరులు

కాశీబుగ్గ: పలాస, మందస మండలాల పరిధిలో కనుమ సందర్భంగా జీవాలకు సంప్రదాయబద్ధంగా చెవులు కోసే పండుగను బుధవారం నిర్వహించారు. గొర్రెలు, మేకలకు పూజలు చేసిన అనంతరం వాటికి కాపర్లు చెవులను కోరారు. ఇలా చేయడం ద్వారా ఎవరి జీవాలను వారు గుర్తు పట్టడానికి అవకాశం ఉంటుందని కాపర్లు తెలిపారు. గిరిజన రైతులు సైతం చెవులు కోసే పండుగను జరుపుకున్నారు.

బ్యాంక్ గ్యారెంటీ టార్గెట్‌లు పూర్తి..

అయోమయంలో రైతులు!

- నచ్చిన మిల్లుకు ధాన్యం అమ్మకాల విషయంలో కొర్రీలు
- నేరుగా అమ్మకాలు చేస్తే మద్దతు ధర విషయంలో ఆందోళన
- పూర్తిస్థాయిలో జరగని నూర్పులు



కె.కొత్తూరు సమీపంలో కళ్లాల్లో ధాన్యం బస్తాల నిల్వలు



చాకిపల్లిలో కళ్లాల్లో ధాన్యం కుప్పలు



చల్లపేట సమీపంలో పంట పొలాల్లోనే వరిచేను కుప్పలు

టెక్కలి నియోజకవర్గంలో ఈ–క్రాప్ నమోదు సమయంలో పంట దిగుబడి అంచనాలు, ప్రస్తుతం శాఖాపరంగా ధాన్యం కొనుగోలు ఇలా..

మండలం	దిగుబడి అంచనా (మెట్రిక్ టన్నుల్లో)	ప్రస్తుతం ధాన్యం కొనుగోలు (మెట్రిక్ టన్నుల్లో)
టెక్కలి	32,444	15,526.2
కోటబొమ్మాళి	38,635	21,903.1
నందిగాం	41,922	18,032.8
సంతబొమ్మాళి	43,829	22,474.6

టెక్కలి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులు పండించిన ధాన్యం అమ్మకాల విషయంలో అవస్థలు ఎదుర్కొంటున్నారు. వారికి నచ్చిన మిల్లుకు వెళ్లి ధాన్యం అమ్మకాలు చేసుకోవచ్చునని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. మద్దతు ధర కూడా కచ్చితంగా అందజేస్తామని చెప్పి ధాన్యం కొనుగోలులో ఈ ఏడాది కొత్త విధానాన్ని అమలు చేసింది. అయితే ప్రస్తుతం కొన్ని మిల్లులకు బ్యాంక్ గ్యారెంటీ గడువు పూర్తి కావడంతో శాఖాపరంగా కొనుగోలు ప్రక్రియ నిలిపివేశారు. ప్రభుత్వం నుంచి కాకుండా నేరుగా రైస్ మిల్లు వద్దకు వెళ్లి ధాన్యం అమ్మకాలు చేసుకునే విషయంలో మద్దతు ధర వస్తుందో.. రాదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులకు అనుకూలంగా ఉన్న మిల్లులకు బ్యాంక్ గ్యారెంటీ లక్ష్యాలు పూర్తి కావడంతో ధాన్యం అమ్మకాల విషయంలో అయోమయం చెందుతున్నారు. అలాగే నూర్పులు సైతం పూర్తి స్థాయిలో జరగలేదు. మరో వైపు కళ్లాల్లో ధాన్యం బస్తాలు నిల్వలు ఉన్నాయి. ఈ–క్రాప్ చేసే సమయంలో గుర్తించిన దిగుబడి అంచనాలు, ప్రస్తుతం ధాన్యం కొనుగోలును దృష్టిలో ఉంచుకుని బ్యాంక్ గ్యారెంటీ లక్ష్యాలను పెంచుతూ ఇబ్బందులు లేకుండా శాఖాపరంగా ధాన్యం అమ్మకాలు చేసే విధంగా అధికారులు దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి



ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి. శాఖా పరంగా ధాన్యం అమ్మకాలు చేసినట్లయితే మద్దతు ధర వచ్చే అవకాశం ఉంది. ఖరీఫ్‌లో పండించిన పంట మొత్తం కొనుగోలు చేసే విధంగా అధికారులు దృష్టి సారించాలి.

– హెచ్.వెంకటేశ్వరరావు, రైతు, తలగాం, టెక్కలి మండలం

ఆందోళన వద్దు..



ధాన్యం అమ్మకాల విషయంలో రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కొన్ని మిల్లులకు బీజీలు పూర్తయినప్పటికీ రైతులు సాధారణంగా ధాన్యం అమ్మకాలు చేసుకోవచ్చు. ఏ విధంగా అమ్మకాలు చేసినా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర వచ్చే విధంగా ఇప్పటికే పటిష్టమైన చర్యలు చేపట్టాం. బీజీలు పెంచే విషయంలో జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. రైతులకు ఇబ్బందులు లేకుండా మద్దతు ధర వచ్చే విధంగా ధాన్యం అమ్మకాలు చేయిస్తాం.

– ఎం.కృష్ణమూర్తి, ఆర్డీవో, టెక్కలి

హోమియో వైద్యుడికి జాతీయస్థాయి గుర్తింపు



విద్యాసాగర్

టెక్కలి: టెక్కలికి చెందిన హోమియోపతి వైద్యుడు నంబాళ్ల విద్యాసాగర్‌కు జాతీయస్థాయిలో యూత్ ఐకాన్ గుర్తింపు వరించింది. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటనలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 11, 12 తేదీలలో న్యూఢిల్లీలో జరిగిన వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ కార్యక్రమంలో విద్యాసాగర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయూష్ రంగంలో యువత పాత్ర అనే అంశంపై విద్యాసాగర్ ప్రసంగించాన్ని మెచ్చుకుంటూ యూత్ ఐకాన్‌గా గుర్తించారు. విద్యాసాగర్‌కు జాతీయ స్థాయిలో గౌరవం దక్కడం పై స్థానికులు అభినందించారు.

కబడ్డీ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

టెక్కలి: సంక్రాంతి నేపథ్యంలో టెక్కలి మండలం రావివలస గ్రామంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి రావివలస జట్టు, రెండవ బహుమతి ఉదయపురం జట్టు గెలుచుకున్నాయి. అనంతరం సర్పంచ్ సర్లాన బాలకృష్ణ, గ్రామ పెద్దలు ఎస్.సుధాకర్, ఎస్.కృష్ణమూర్తి, డి.కృష్ణారావు, పి.శ్రీనివాస్, నారాయణ, దిలీప్, పాల్గుణ తదితరుల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

వైద్యులకు సన్మానం



డాక్టర్ నిమ్మన దాస్‌ను సత్కరిస్తున్న స్నేహహస్తం సభ్యులు

సోంపేట: స్నేహహస్తం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కనుమ పండుగ సందర్భంగా బుధవారం సోంపేట పట్టణంలో ప్రత్యేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కరోనా సమయంలో తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ప్రజలకు వైద్య సేవలు అందించిన డాక్టర్లను సన్మానించారు. వైద్యులు రాజేంద్రప్రసాద్, నిమ్మన దాస్, జోగినాయుడు, లక్ష్మీనారాయణ, గోవింద్ తదితరులలను సంస్థ ఆధ్వర్యంలో దుశ్శాలువలు కప్పి, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. వైద్యులు అందించిన సేవలు కొనియాడారు. అనంతరం రోగులకు పళ్లు, రొట్టెలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు తెలుకుల కృష్ణారావు, పసుపురెడ్డి రాము పాల్గొన్నారు.

సైనికునికి సత్కారం



దేశ రక్షణలో రేయింబవళ్లు అలుపెరగని దీక్షతో సేవలు చేస్తున్న సైనికుల సేవలు అమూల్యమైనవని వక్తలు అన్నారు. జాతీయ సైనిక దినోత్సవాన్ని కవిటిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కవిటికి చెందిన సైనికుడు.. అసోంలో సేవలందిస్తున్న పొల్లాయి సురేష్‌ను గ్రామస్తులు ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు. – కవిటి

బహుమతులు అందజేత



సంక్రాంతి సందర్భంగా డోకులపాడులో ప్రేరణ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో మండల స్థాయి ప్రతిభ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్పంచ్ వడ్డి సరితాకరుణాకర్, ఎంపీటీసీ సభ్యురాలు కొరియి భాగ్యలక్ష్మి, ఢిల్లీరావు, క్లబ్ అధ్యక్షులు పుక్కళ్ల దిలీఫ్ చేతుల మీదగా ప్రతిభ కనబర్చిన జి.వాసవ్య, లండ మౌనిక, వంక వేణు, ఎల్.జాహ్నవిలకు బహుమతులు అందజేశారు. మత్స్యకార సంఘ అధ్యక్షుడు యంపల్ల పాపారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జి.పోలయ్య ఉన్నారు. – వజ్రపుకొత్తూరు రూరల్

వాహనాల తనిఖీ..



టెక్కలి సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ జంక్షన్ వద్ద సీఐ తన సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. డ్రంక్ అండ్ డ్రైవ్, అతివేగంగా, ట్రిబుల్ రైడ్ చేస్తున్న వాహనాలు ఆపి రికార్డులు పరిశీలించి అపరాధ రుసుం విధించారు. అనంతరం మైనర్ డ్రైవర్‌లకు, ట్రిపుల్ రైడ్ చేసిన వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. – టెక్కలి రూరల్



ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

టెక్కలి రూరల్: మండలంలోని తలగాం ఎట్నొపడ ఆర్ఎస్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–05 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం కలుసుకున్నారు. దీనికి చదువుకున్న పాఠశాల ఆవరణే వేదికైంది. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చదువుకున్న రోజులను గుర్తు చేసుకొని మురిసిపోయారు. గ్రూపు ఫొటో తీసుకొని మురిసిపోయారు. చదువు నేర్పిన గురువులను సత్కరించి గౌరవించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కామేష్, లక్ష్మి, ఆనందరావు, పరమేశ్వరరావు, విద్యావతి, గణపతిరావు ఉన్నారు.

మదినిండుగా..

పెద్ద పండుగ..

పెద్ద పండుగ సంక్రాంతిని సంప్రదాయబద్ధంగా ప్రజలు జరుపుకున్నారు. మంగళవారం సంక్రాంతి, బుధవారం కనుమను కుటుంబ సభ్యులతో కలిసి మదినిండుగా జరుపుకొని హాయిగా గడిపారు. సంక్రాంతి రోజున పెద్దలకు పాత్రలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కనుమనాడు పశువులను రైతులు అందంగా అలంకరించి.. పూజలు చేసి సంప్రదాయాన్ని కొనసాగించారు. అలాగే బసవన్నల సందడి, ఆడపడుచులు వేసిన రంగవల్లికలతో పల్లెలు కళకళలాడాయి. చాలా మంది పేదలకు వస్త్రదానం చేసి ఔదర్యాన్ని చాటుకున్నారు. మరికొన్ని చోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. యువకులు గాలిపటాలు ఎగరవేస్తూ సందడి చేశారు. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పలుచోట్ల సంక్రాంతి సంబరాలు వైభవంగా జరిగాయి. కొత్త దుస్తులు ధరించి యువతీ యువకులు ఆనందంతో గడిపారు.

– సాక్షి నెట్ వర్క్



వజ్రపుకొత్తూరు రూరల్: ఆకట్టుకున్న రంగవల్లిక

- సంప్రదాయబద్ధంగా సంక్రాంతి



కంచిలి: కన్యకా పరమేశ్వరి అమ్మవారి చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కళింగ కోమట్ల ప్రతినిధులు



కంచిలి: సంక్రాంతి సంబరాల్లో మహిళల కోలాటం ప్రదర్శన



కవిటి: మండపంపల్లివీధిలో ముగ్గుల మహిళలు



కవిటి: రాజపురం సీతారామాలయంలో శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో బాలికల ప్రదర్శన



కవిటి: గోపూజలో ఎమ్మెల్సీ నర్తు రామారావు దంపతులు



సోంపేట: ఉప్పలాం పంచాయతీలో జరిగిన రంగవల్లిక పోటీల్లో పర్యావరణ పరిరక్షణపై వేసిన ముగ్గు



ఇచ్ఛాపురం రూరల్: బూర్జపాడులో సంక్రాంతి వేడుకల్లో మహిళలు



కవిటి అగ్నికుల క్షత్రియుల పెద్దవయ సంఘం ఆధ్వర్యంలో సామూహిక సంక్రాంతి విందు భోజనాల ప్రసాదాలు



ఇచ్ఛాపురంబెల్లుపడ గ్రామంలో గోమాతకు ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు



ఇచ్ఛాపురం: బెల్లుపడలో గాలిపటాల పోటీల్లో చిన్నారులు



ఇచ్ఛాపురం రూరల్: సంక్రాంతి కోలాటం ఆడుతున్న మహిళలు



ఇచ్ఛాపురం పట్టణంలో ఇంటిముందు వేసిన సంక్రాంతి ముగ్గు



ఇచ్ఛాపురం: జగన్నాథస్వామి ఆలయంలో గోమాతకు పూజలు చేస్తున్న భక్తులు



కాశీబుగ్గ: బ్రాహ్మణతర్లా నడిమి వీధిలో ముగ్గుల పోటీలలో స్థానికులు



కాశీబుగ్గ: రామకృష్ణాపురంలోని సత్యసాయి విద్యా విహార్‌లో గోవులకు పూజలు చేస్తున్న దృశ్యం